సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 8 । మే । 2025



చోరీ చిన్నదే.. నష్టమే భారీగా
కొందరు దుండగులు ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి కాపర్‌వైరు కాజేస్తుండగా విద్యుత్ శాఖపై భారం పడుతోంది. 10లో



మిర్చి ధర పతనం
మిర్చి ధర నానాటికీ తగ్గుతుండగా రైతులు భారీగా నష్టపోతున్నారు. పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదంటున్నారు. 10లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
38° / 26°
జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్నిచోట్ల ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పర్ణశాల ఆలయ హుండీ లెక్కింపు



నగదు లెక్కిస్తున్న ఈఓ తదితరులు

దుమ్ముగూడెం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయ హుండీలను భద్రాచలం దేవస్థానం ఈఓ రమాదేవి ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. 328 రోజులకు గాను రూ.19,20,061 ఆదాయం వచ్చిందని ఆమె తెలిపారు. గతేడాది జూన్ 13న చివరిసారిగా హుండీలు లెక్కించామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ భవానీ రామకృష్ణ, శ్రీనివాస్, ఆలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌ల ఊబిలో చిక్కుకోవద్దు

ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంఅర్బన్: సులభంగా డబ్బు వస్తుందనే ఆశతో ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గేమ్‌లు, పేకాట, స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ ఊబిలో చిక్కుకోవద్దని ఎస్పీ రోహిత్‌రాజు బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. మొదట్లో కొద్దిపాటి లాభం రాగానే, పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించాలనే ఆలోచనతో కొందరు వీటికి బానిసలుగా మారారని తెలిపారు. యువత మాత్రమే కాక రిటైర్డ్ ఉద్యోగులు, పెద్ద వయసు వారు కూడా ఇలాంటి వాటికి అలవాటు పడుతూ ఉన్నదంతా పోగొట్టుకుంటున్నారని, ఆ తర్వాత అప్పుల బాధ తట్టుకోలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. నిమిషాల్లోనే అప్పు ఇస్తామంటూ వస్తున్న లోన్ యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలు నిత్యం ఏం చేస్తున్నారు.. ఎలాంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నారో తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. ఎవరైనా ఆన్‌లైన్ లేదా నేరుగా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పరిధిలోని నిరుద్యోగులు, ప్రభావిత, పరిసర ప్రాంతాల యువత, మాజీ, ప్రస్తుత కార్మికుల పిల్లలకు నైపుణ్యాభివృద్ధి అంశాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం షాలేంరాజు తెలిపారు. హైదరాబాద్‌లోని జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సహకారంతో ఎనిమిది రకాల కోర్సుల్లో నెల రోజులు శిక్షణ ఉంటుందని వెల్లడించారు. ఒక్కో కోర్సుల్లో 30 మందికి అవకాశం ఉండగా, 18 – 28 ఏళ్ల వయస్సు వారు ఈనెల 30వ తేదీలోపు కొత్తగూడెంలోని మైన్స్ ఒకేషనల్ ట్రెయినింగ్ సెంటర్ (ఎంవీటీసీ)లో అవసరమైన సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలని జీఎం సూచించారు. వివరాలకు 98661 17145నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

సాహో.. సిందూర్



కశ్మీర్‌లో పహల్గామ్ దుర్ఘటనకు ప్రతిగా పాకిస్తాన్, పీఓకేలో ఉన్న ఉగ్రమూకల స్థావరాలపై భారత ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు జిల్లా ప్రజలు సాహో అన్నారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా సిందూర్‌పైనే చర్చ జరిగింది.
– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

'ఆపరేషన్ సిందూర్'పై జయజయధ్వానాలు

- ఉదయం నుంచి జోరుగా సాగిన చర్చలు
- ఏ ఇద్దరు కలిసినా ఇదే విషయం ప్రస్తావన
- జాతీయ జెండాతో పలు చోట్ల ప్రదర్శనలు

గ్రూపుల్లోనూ ఇదే అంశం..

అర్ధరాత్రి దాటిన తర్వాత పాకిస్తాన్‌లోని ఉగ్రమూకల పీచమణిచే పనిని భారత ప్రభుత్వం చేపట్టింది. ఇందుకు సంబంధించిన విశేషాలు బుధవారం తెల్లవారుజాము నుంచే సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. దీంతో ఉదయం నుంచే ఈ ఆపరేషన్ సంగతులు తెలుసుకునేందుకు ప్రజలు ఆసక్తి కనబరిచారు. ముఖ్యంగా అన్ని వాట్సాప్ గ్రూపుల్లోనూ ఈ అంశంపైనే ప్రజలు ఎక్కువగా చాటింగ్ చేశారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్న పాకిస్తాన్ తీరును ఎండగట్టడంతో పాటు ఆపరేషన్‌లో పాల్గొన్న భారత ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌లపై ప్రశంసల వర్షం కురిపించారు. ఉదయం నుంచి చాలా మంది తమ వాట్సాప్ డీపీలు, స్టేటస్‌లను సిందూర్ విశేషాలతో నింపేశారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాల్లో భారత త్రివిధ దళాలకు అభినందనలు తెలుపుతూ పోస్టింగులు చేశారు.

ఏ ఇద్దరు కలిసినా..

ఉదయం పది గంటల నుంచి వివిధ పనుల మీద బయటకు వచ్చిన వారిలో చాలా మంది భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన అంశాలపై చర్చించుకోవడం కనిపించింది.



ఆపరేషన్ సిందూర్‌ను పురస్కరించుకుని పాల్వంచలో బీజేపీ నాయకుల సంబరాలు

అప్పటి వరకు తమకు వచ్చిన వీడియోలను ఒకరికొకరు చూపించుకుంటూ తమ అభిప్రాయాలను పంచుకున్నారు. కేఫ్‌లు, ఎలక్ట్రానిక్స్ షోరూమ్స్, హెయిర్ సెలూన్ తదితర ప్రదేశాల్లోనూ సినిమా కంటెంట్ కంటే న్యూస్ చానళ్లలో భారత దాడికి సంబంధించిన వివరాలు తెలుసుకోవడానికే ప్రజలు ఎక్కువగా ఆసక్తి కనబరిచారు. ఈ దాడికి సంబంధించిన విశేషాలను మీడియాలో వెల్లడించిన విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, ఇండియన్ ఆర్మీలో కల్నల్ హోదాలో పని చేస్తున్న సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ గురించి తెలుసుకోవడానికి ప్రజలు ఆసక్తి చూపించారు. మహిళా ఆఫీసర్లు ఈ ఆపరేషన్‌లో కీలక భూమిక పోషించిన వైనం తెలుసుకుని రుద్రమ, ఝాన్సీరాణిలతో పోల్చుతూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

జాతీయ పతాకంతో

పాకిస్తాన్ ఉగ్రవాదుల స్థావరాలపై మెరుపుదాడులు చేసిన భారత ఆర్మీని అభినందిస్తూ పాల్వంచ అంబేడ్కర్ సెంటర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ పతాకంతో సంబరాలు జరిపారు. బాణాసంచా కాల్చారు. ఇల్లెందులో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆర్మీని ప్రశంసిస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు. వివిధ ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు సైతం ఈ అంశంపై హర్షం వ్యక్తం చేశాయి.

జవాన్లకు మద్దతుగా ర్యాలీలు

ఇల్లెందు/పాల్వంచ/మణుగూరురూరల్ : పాకిస్తాన్ ఉగ్రవాద స్థావరాలపై భారత ఆర్మీ మెరుపు దాడి చేయడంతో జవాన్లకు మద్దతుగా జిల్లాలో పలువురు సంబరాలు జరుపుకున్నారు. పాల్వంచలో బీజేపీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించగా, మణుగూరులో బీఆర్‌ఎస్ నాయకులు ర్యాలీ చేశారు. ఇల్లెందులో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఉగ్రవాద చర్యలను విజయవంతంగా తిప్పికొట్టేందుకు భారత్ సిద్ధంగా ఉందని, అందుకు ప్రజా మద్దతు అవసరమని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు చింతలచెర్వు శ్రీనివాసరావు, భూక్యా రవినాయక్, కల్యాణ్, దొడ్డా రాంబాబు, భూక్యా శంకర్, బీఆర్‌ఎస్ మణుగూరు మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు, నాయకులు కుంటా లక్ష్మణ్, నూకారపు రమేష్, ఆవుల నర్సింహారావు, ఎడవల్లి వెంకటయ్య, ముద్దంగుల కృష్ణ, ప్రభుదాస్, జావిద్‌పాషా, ఎండి హబీబ్, వేర్పుల సురేష్, రామకోటి, ఇజ్రాయిల్, టీపీటీఎఫ్ నేతలు జేమ్స్ అంథోని, బి.వెంకట్రాం, సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు..



పినపాక : ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి, పక్కన కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తదితరులు

- ఇందిరమ్మ రాజ్యంతోనే పేదలకు లబ్ధి
- నిరుద్యోగ యువతకు ఆర్‌వైవీ ద్వారా ఉపాధి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

దుమ్ముగూడెం/చర్ల/పినపాక/భద్రాచలంటౌన్: రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన 16 నెలల్లో అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లలా పాలన సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తమ హయాంలోనే పేదలకు లబ్ధి చేకూరుతుందని, జిల్లాలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. బుధవారం ఆయన పినపాక, చర్ల, దుమ్ముగూడెం మండలాలతో పాటు భద్రాచలం పట్టణంలో పర్యటించారు. భద్రాచలంలో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైయినేజీ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రంథాలయంలో నిర్మించిన హాల్‌ను, చర్ల మండలం సుబ్బంపేటలో గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని, లక్ష్మీ కాలనీలో గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించారు. సుబ్బంపేటలో సన్నబియ్యం లబ్ధిదారుడు వాసం ముసలయ్య ఇంట్లో భోజనం చేశారు. మొదట పినపాక మండలం గొట్టెల గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. దుమ్ముగూడెం మండలం చిన్నబండిరేవులో సీసీ రోడ్లను ప్రారంభించి, ఇందిరమ్మ ఇంటికి, సింగవరం – ఎస్ లక్ష్మీపురం మధ్య హై లెవల్ బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా పేదలకు అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రతీ నియోజకవర్గానికి 4 వేల మంది నిరుద్యోగులకు రాజీవ్ యువ వికాస్ ద్వారా రూ.5 లక్షలతో ఉపాధి కల్పిస్తున్నామని, రైతుల కోసం భూ భారతి పోర్టల్‌ను రూపొందించామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పోటీ పరీక్షలకు సిద్ధపడే నిరుద్యోగుల కోసం స్టడీ మెటీరియల్ ఉచితంగా అందిస్తున్నామని, గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

అర్హులకు ఇళ్లు ఇవ్వడం లేదంటూ ఫిర్యాదులు..

చర్ల మండలం తేగడలో లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని, పూరి గుడిసెలు, డేరాల్లో నివసించే వారికి కాకుండా పక్కా ఇళ్లు ఉన్నవారికే జాబితాలో చోటు కల్పించారని పలువురు మంత్రి దృష్టికి తెచ్చారు. దీంతో అధికారులు, స్థానిక నాయకులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపునకు అర్హులనే ఎంపిక చేయాలని సూచించారు. ప్రభుత్వానికి చెడు పేరు తీసుకొచ్చేలా వ్యవహరించొద్దని, అర్హులకే ఇళ్లు ఇవ్వాలని అన్నారు. ఈ మేరకు మరోసారి విచారణ నిర్వహించాలని కలెక్టర్‌కు సూచించారు. దుమ్ముగూడెంలోనూ ఇదేఅంశంపై సీపీఎం, సీపీఐ నాయకులు పొంగులేటికి ఫిర్యాదు చేయగా.. అనర్హులకు ఇళ్లు కేటాయిస్తే నిర్మాణం మధ్యలో ఉన్నా.. రద్దు చేస్తామని స్పష్టం చేశారు. పినపాక మండలంలో స్థానిక మహిళలు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి కూడా ఇదే సమస్య తీసుకురాగా, సమస్య పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ జితేష్ వి పాటిల్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీఓ బి.రాహుల్, డీఆర్డీఓ విద్యాచందన, ఆర్డీఓ దామోదర్‌రావు, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డీఎస్పీ వంగా రవీందర్ రెడ్డి, హౌసింగ్ పీడీ శంకర్, ఏఈ వినీత, మిషన్ భగీరథ ఈఈలు తిరుమలేష్, నళిని, ఏడీఏ తాతారావు, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ హరిలాల్, ఇరిగేషన్ ఈఈ తిరుపతి, జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వి.అర్జున్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తెల్లం సీతమ్మతో పాటు పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



భద్రాచలంలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న పొంగులేటి, పక్కన కలెక్టర్, ఎమ్మెల్యే

నేడు రామయ్య దర్శనం

బుధవారం రాత్రి సారపాక ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో బసచేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం తెల్లవారుజామున భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకుంటారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

ధాన్యం ఎప్పుడు కాంటా వేస్తారు?

తల్లాడలో రైతుల రాస్తారోకో

తల్లాడ: తల్లాడ మండలం కుర్నవల్లి పరిసర గ్రామాల్లోని నెల రోజులుగా కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని ఆరోపిస్తూ రైతులు బుధవారం ఆందోళనకు దిగారు. కుర్నవల్లిలోని కేంద్రానికి 120 లారీల మేర ధాన్యం తీసుకురాగా.. కాంటాలో జాప్యంతో ఇంకా 80 లారీల ధాన్యం మిగిలిపోయింది. ఇంతలోనే అకాల వర్షాలతో రైతులు పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నా.. గన్నీ సంచులు, లారీలు లేవని అధికారులు తాత్సారం చేస్తున్నారు. దీంతో రైతులు బుధవారం మధ్యాహ్నం మండుటెండలో తల్లాడ చేరుకుని ప్రధాన రహదారిపై ట్రాక్టర్లు అడ్డుగా పెట్టి రాస్తారోకోకు దిగారు. ఈమేరకు అటు కల్లూరు, ఇటు వైరా రోడ్లలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ట్రెయినీ ఎస్‌ఐ వెంకటేశ్, సిబ్బంది చేరుకుని వారికి నచ్చచెప్పినా తహసీల్దార్ వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పే వరకు ఆందోళన విరమించే ప్రసక్తి లేదని తేల్చిచెప్పారు. ఈ క్రమాన బలవంతంగా రైతులను లేపే ప్రయత్నం చేయగా ఇరువర్గాల వాగ్వాదంతో ఉద్రిక్తత నెలకొంది. ఇంతలోనే తహసీల్దార్ సురేష్‌కుమార్ చేరుకుని పౌర సరఫరాల సంస్థ డీఎం శ్రీలత, ఆర్డీఓ రాజేందర్‌గౌడ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. విడతల వారీగా 40 లారీలతో పాటు గన్నీ సంచులు పంపిస్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు శీలం సత్యనారాయణరెడ్డి, కళ్యాణపు కృష్ణయ్య, కట్టా దర్గయ్య, షేక్ మస్తాన్, చల్లా నాగేశ్వర్‌రావు, ఎస్.వీ.రాఘవులు, కట్టా కృష్ణారావు, చలపతిరెడ్డి, మాధవరావు, లక్ష్మారెడ్డి, బద్దం నాగిరెడ్డి, అయిలూరి సత్యనారాయణరెడ్డి, వరకిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రహదారిపై బైఠాయించిన రైతులు, నాయకులు

మెరుగైన వైద్య సేవలందించాలి

కొత్తగూడెంఅర్బన్: ప్రజల ఆరోగ్య సంరక్షణ సేవలను మెరుగుపర్చాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎల్.భాస్కర్‌నాయక్ తెలిపారు. జిల్లాలోని వైద్యాధికారులు, పీహెచ్‌సీల పర్యవేక్షణ సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణులు, శిశువుల ఆరోగ్యాన్ని నిర్ధారించడానికి ప్రసవానంతర సంరక్షణ కోసం ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేసుకునేలా చూడాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంపునకు కృషి చేయాలని సూచించారు. ఆపరేషన్లను తగ్గించి సాధారణ ప్రసవాల కోసం ప్రయత్నించాలని, అత్యవసరమైతేనే శస్త్రచికిత్స చేయాలని ఆదేశించారు. చికిత్స పొందుతున్న క్షయ వ్యాధిగ్రస్తులకు పోషక కిట్లను పంపిణీ చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.జయలక్ష్మి, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ మధువరన్, వైద్యులు తేజశ్రీ, పుల్లారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భాస్కర్‌నాయక్

భూసార పరీక్షలు చేయించాలి

దమ్మపేట: రైతులు తప్పనిసరిగా పొలాల్లో భూసార పరీక్షలు చేయించి, తదనుగుణంగా రసాయన ఎరువులు వేసుకోవాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జే.హేమంత్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని మారప్పగూడెంలో నిర్వహించిన 'రైతుల ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భూమిలో ఉన్న పోషక విలువల ఆధారంగా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవాలని, తద్వారా సాగు ఖర్చులను ఆదా చేయవచ్చని సూచించారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు రవికుమార్, వ్యవసాయ శాస్త్రవేత్తలు రాంప్రసాద్, రమేష్ మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని సూచించారు. బిందు సేద్యం, పర్యావరణ పరిరక్షణ, పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ చంద్రశేఖరరెడ్డి, హెచ్‌ఓ సందీప్, హెచ్‌ఎం సుబ్బారావు, ఏఈఓలు వినోద్, అనుబాబు, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హేమంత్‌కుమార్

ఇంకా ఎదురుచూపులే..

- కొత్త రేషన్‌కార్డు దరఖాస్తులు 53 వేలకు పైగానే
- ఈ నెలలో జారీ అయినవి 365 మాత్రమే
- 23,965 కార్డుల్లో మార్పులు, చేర్పులు
- జిల్లాకు అదనంగా 135 మెట్రిక్ టన్నుల బియ్యం

కొత్తగూడెంఅర్బన్: రేషన్‌కార్డులు లేక జిల్లాలోని పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఏ ప్రభుత్వ పథకానికైనా రేషన్ కార్డే ప్రామాణికం కావడంతో అవి లేనివారు లబ్ధి పొందలేకపోతున్నారు. ప్రజాపాలన గ్రామసభలు, వార్డు సభల్లో వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే వాటిపై మండలాలు, మున్సిపాలిటీల్లో ఇంకా సర్వేలు కొనసాగుతూనే ఉన్నాయి. రెవెన్యూ అధికారులు సంబంధిత యాప్‌లో నమోదు చేశాక, ఆ వివరాలు సివిల్ సప్లై ఉన్నతాధికారులకు చేరి, అక్కడి నుంచి అప్రూవ్ వస్తేనే లబ్ధిదారులకు కార్డు మంజూరు చేస్తామని జిల్లా అధికారులు అంటున్నారు. అయితే ఈ విషయమై సరైన అవగాహన కల్పించకపోవడంతో చాలా మంది మళ్లీ మళ్లీ దరఖాస్తు చేసుకుంటున్నారు. తద్వారా సర్వే ప్రక్రియలో జాప్యం జరుగుతోంది.



కొత్తగూడెంలోని రేషన్‌షాపులో బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు

కొత్తగా వచ్చినవి 365 కార్డులే..

జిల్లాలో కొత్త రేషన్‌కార్డుల కోసం ప్రజాపాలన, గ్రామ, వార్డు సభల్లో 53 వేల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. అయితే మే నెలలో 365 కొత్త కార్డులు మాత్రమే మంజూరయ్యాయని పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. కాగా, 2017 నుంచి రేషన్‌కార్డుల్లో మార్పులు చేర్పుల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి సంబంధించి ప్రక్రియ పెండింగ్‌లో ఉండగా.. ప్రస్తుతం వారి సమస్య పరిష్కారమైందని చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 23,965 కార్డులలో మార్పులు చేర్పులు జరిగాయని అంటున్నారు. ఈ కార్డులకు సంబంధించి మే నెలలో 135 మెట్రిక్ టన్నుల బియ్యం అదనంగా రేషన్‌షాపులకు అందాయి. వచ్చే నెలలో మరో మూడు వేల కొత్త కార్డులు జారీ అయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం, అధికారులు చర్యలు చేపట్టి కొత్త కార్డులను వీలైనంత తొందరగా జారీ చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

జిల్లాలో రేషన్‌కార్డుల వివరాలు ఇలా..

రేషన్‌షాపులు	443
ఆహార భద్రత కార్డులు	272112
అంత్యోదయ	21148
అన్నపూర్ణ కార్డులు	03
జిల్లాలో మొత్తం కార్డులు	293263
ప్రతినెల బియ్యం	5384.762 మెట్రిక్ టన్నులు

ప్రక్రియ కొనసాగుతోంది



జిల్లాలో కొత్త రేషన్‌కార్డులకు సంబంధించిన సర్వే ప్రక్రియ కొనసాగుతోంది. మే నెలలో 365 కొత్త కార్డులు జారీ అయ్యాయి. వీటితో పాటు ఏళ్ల తరబడిగా పెండింగ్‌లో ఉన్న మార్పులు చేర్పుల సమస్య కూడా పరిష్కారం అయింది. వచ్చే నెలలో మరో 3 వేల కొత్త కార్డులు వచ్చే అవకాశం ఉంది. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ అవుతాయి. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.
– రుక్మిణి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

చూస్తుంటే ఆనంద'మే'

ఏడాదికోసారి మే నెలలో వికసించే పుష్పాలు చక్కటి అందాలను పంచుతున్నాయి. మండు వేసవిలోనూ గులాబీ వర్ణంలో విరబూస్తున్న పూలు అబ్బురపరిచేలా ఉంటూ అందరినీ అకట్టుకుంటున్నాయి. ములకలపల్లి మండలం కమలాపురం గ్రామానికి చెందిన వ్యాపారి సుగ్గల విజయబాబు ఇంటి ఆవరణలో పూసిన ఈ పుష్పాలను పలువురు ఆసక్తిగా తిలకిస్తున్నారు. – ములకలపల్లి



క్లుప్తంగా

బైక్‌పైకి దూసుకొచ్చిన లారీ
త్రుటిలో తప్పిన ప్రమాదం



లారీ కింద పడి నుజ్జునుజ్జయిన బైక్

పాల్వంచ: మూలమలుపు వద్ద ఓ లారీ బైక్ మీదకు దూసుకెళ్లిన ఘటన బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... ములకలపల్లి వైపు నుంచి కొత్తగూడెం వైపు వస్తున్న లారీ దమ్మపేట సెంటర్ వద్ద మలుపు తిరుగుతున్న క్రమంలో రోడ్డు పక్కనే ఉన్న బైక్ పైకి దూసుకెళ్లింది. దీంతో బైక్‌పై ఉన్న వ్యక్తి తన వాహనాన్ని వదిలేసి పక్కకు వెళ్లిపోయాడు. దీంతో బైక్ లారీ చక్రాల కింద పడి నుజ్జునుజ్జయింది. ద్విచక్రవాహన దారుడికి త్రుటిలో ప్రమాదం తప్పింది. సంఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించి వివరాలు సేకరించారు.

నెమళ్ల కోసం మందు పెట్టిన దుండగులు
ఖమ్మంరూరల్: మండలంలోని చింతపల్లిలో పొలాల వద్ద నెమళ్ల కోసం గుర్తుతెలియని వ్యక్తులు మందు పెట్టగా, ఆ మందు తినడంతో నాలుగు ఆవులు మృతి చెందాయి. గ్రామానికి చెందిన కొందరు రైతులు తమ ఆవులను మేత కోసం విడిచి పెట్టారు. ఆ ప్రాంతంలో నెమళ్ల తిరుగుతున్నాయనే సమాచారంతో దుండగులు అక్కడ ఉన్న గడ్డిపై మందు చల్లారు. అదే ప్రాంతానికి వెళ్లిన నాలుగు పశువులు గడ్డి మేయడంతో మృతి చెందాయి. ఈ విషయమై వెటర్నరీ వైద్యుడు హరీశ్‌ను వివరణ కోరగా విషపూరితమైన గడ్డి తినడంతోనే ఆవులు మృతి చెందాయని తెలిపారు. అలాగే, రైతులు వేసవిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కువ మోతాదులో అన్నం, వడ్లు, బియ్యం, మొక్కజొన్న పెడితే అరగక పొట్ట ఉబ్బి పశువులు మృతి చెందే అవకాశం ఉందని తెలిపారు.

విత్తన ఏజెంట్ మోసం చేశాడని రైతుల ఆగ్రహం
కొణిజర్ల: పంటకు మంచి ధర చెల్లిస్తామని చెప్పి, ఇప్పుడు ముఖం చాటేసిన కంపెనీ ప్రతినిధులు, ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరారు. ఈ సందర్భంగా బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాక వారు వివరాలు వెల్లడించారు. కొణిజర్ల మండలం తీగలబంజరకు చెందిన ఓ వ్యక్తి రెండు కంపెనీలకు చెందిన ఆడ, మగ రకం మొక్కజొన్న విత్తనాలను కొణిజర్ల, వైరా, కారేపల్లి, జూలూరుపాడు మండలాల్లో పలు గ్రామాల రైతులకు ఇచ్చాడు. కానీ, సరైన దిగుబడి రాకపోవడంతో ఆందోళన చేయగా పరిహారం ఇప్పిస్తానని కాగితాలు రాసి ఇచ్చాడు. ఆ తర్వాత కంపెనీకి మక్కలు తరలించినా రైతులకు డబ్బులు ఇవ్వకపోగా ఏజెంట్ కానరావడం లేదు. దీంతో మంగళవారం అర్ధరాత్రి ఆయన ఇంటికి వచ్చినట్లు తెలుసుకుని లాలాపురం వాసులు ఆందోళన చేయగా పోలీసులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు బుధవారం పలువురు రైతులు బుధవారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తమకు డబ్బులు ఇప్పించాలని ఎస్‌ఐ జి.సూరజ్‌ను కోరారు. కంపెనీ ప్రతినిధులను గురువారం పిలిపించాక చర్యలు తీసుకుంటానని తెలిపారు. అయితే, సదరు ఏజెంట్ ముందుగానే డబ్బు తీసుకున్నాడని కంపెనీ ప్రతినిధులు చెబుతుండగా, తనకు రూ.25 లక్షలు కంపెనీ నుంచి రావాలని ఏజెంట్ చెప్పినట్లు సమాచారం.

హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు
ఖమ్మంలీగల్: హత్య కేసులో ఖమ్మం జిల్లాలోని తిరుమలాయపాలెం మండలం కుక్కలతండా గ్రామానికి చెందిన ముగ్గురికి జీవిత ఖైదు, మరో ఏడుగురికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కుక్కలతండాకు చెందిన ఇస్లావత్ లచ్చిరాం, ఆయన అన్న, తమ్ముడు ఉమ్మడి ఆస్తిని 40 ఏళ్ల కిందట పంచుకున్నారు. ఈ భూమిలో 20 కుంటలు తనకు తక్కువగా వచ్చిందని లచ్చిరాం కోర్టును ఆశ్రయించారు. కేసు పెండింగ్‌లో ఉండగానే 2023 జూలై 23న బోడ రవి ఆ భూమిలో దున్నుతుండగా.. లచ్చిరాం కుమారులుఇస్లావత్ బద్రు, ఇస్లావత్ బాలు, కోడళ్లు విజయ, కవిత అడ్డుకున్నారు.దీంతో రవి, ఇస్లావత్ కిషన్, ఇస్లావత్ సేవాతో పాటు పలువురువీరిపై దాడి చేయగా భద్రు, బాలు, కవితకు గాయాలయ్యాయి. అనంతరం చికిత్స పొందుతూ భద్రు జూలై 29న మృతి చెందడంతో దాడి కేసునుహత్య కేసుగా మార్చారు. ఈ మేరకు పోలీసులు చార్జిషీట్ దాఖలుచేయగా, విచారణ అనంతరం బోడా రవి, ఇస్లావత్ కిషన్, ఇస్లావత్‌సేవాకు జీవితఖైదు, మిగిలిన ఏడుగురికి రూ.10 వేల చొప్పున జరిమానావిధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్‌ప్రాసిక్యూటర్ ఎ.శంకర్ వాదించగా, శ్రీకాంత్, భద్రాజీ, యూసుఫ్ సహకరించారు.

విద్యుదాఘాతంతో యువతి మృతి
సత్తుపల్లిటౌన్: ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తాకడంతో షాక్‌కు గురైన యువతి మృతి చెందింది. సత్తుపల్లి మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన భూక్యా బేబీ (25) పశువులు కాసేందుకు బుధవారం సమీప పొలాల్లోకి వెళ్లింది. అక్కడ విద్యుత్ స్తంభం నుంచి కిందకు వేలాడుతున్న తీగ ఆమె తలకు తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. కాగా, మంగళవారం రాత్రి వీచిన ఈదురుగాలులతో స్తంభంపై కాసారం పగిలి తీగ వేలాడిందని విద్యుత్ ఏఈ కావ్య తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ ప్రతాపరెడ్డి తెలిపారు.

చోరీ చిన్నదే.. నష్టమే భారీగా..

రూ. 3 వేల కోసం రూ.1.50 లక్షల ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం
- కాపర్‌వైర్ చోరీ చేస్తూ విద్యుదాఘాతంతో ఓ యువకుడి మృతి
- వ్యవసాయ భూములకు సాగునీరందక రైతులకు నష్టం
- గత ఆర్థిక సంవత్సరంలో 59 ట్రాన్స్ ఫార్మర్లలో చోరీలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆశతో కొందరు చోరీలకు పాల్పడుతూ ప్రాణాలు కోల్పోతున్నారు. జనసంచారం లేని ప్రాంతాలను ఎంచుకుని రాత్రివేళల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి కాపర్‌వైరును కాజేస్తున్నారు. విద్యుతాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోతామని తెలిసినా కాపర్ తీగలను దొంగిలిస్తున్నారు. ఇలాంటి దుశ్చర్యల కారణంగా సాగు భూములకు విద్యుత్ మోటార్ల ద్వారా నీరందక రైతులు సతమతమవుతున్నారు. సుమారు ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ తిరిగి ఏర్పాటు చేయాలంటే రూ.1.50 లక్షల ఖర్చవుతుందని విద్యుత్ అధికారులు పేర్కొంటున్నారు.

పెనగడపలో ఓ యువకుడి మృతి
విద్యుత్ లైన్లను తొలగించి ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి కాపర్ వైరు చోరీ చేయాలంటే ఎలక్ట్రిసిటీ పనులపై పట్టు ఉండాలి. రాత్రిపూట చేసే ఈ దొంగతనాల కారణంగా చీకట్లో పొరపాటు ఏదైనా జరిగితే ప్రాణాలు కోల్పోవాల్సిన ప్రమాదం పొంచి ఉంటుంది. కొన్ని నెలల క్రితం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామవరానికి చెందిన ఓ యువకుడు తన స్నేహితులతో కలిసి చుంచుపల్లి మండలం పెనగడప అటవీప్రాంతంలో ఇదేవిధంగా చోరీకి ప్రయత్నించి విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయాడు. ఆ కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చాడు. వ్యసనాలకు బానిసై మద్యం, గంజాయి మత్తులో కొందరు ఇలాంటి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి దొంగిలించే కాపర్ విలువ సుమారు రూ.3 వేల వరకు మాత్రమే ఉంటుంది. కానీ ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు నిర్వహించి పునరుద్ధరించాలంటే విద్యుత్ శాఖ రూ. లక్షల్లో వెచ్చించాల్సి వస్తోంది.



కాపర్ వైర్ కోసం పగులగొట్టిన ట్రాన్స్‌ఫార్మర్(ఫైల్)

ఏర్పాటులో జాప్యం
చోరీ కేసు కావడంతో పోలీసుల ఎఫ్‌ఐఆర్ మొదలు కేసు విచారణ జరిగే వరకు నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు అనుమతి లభించదు. ఈ ప్రక్రియకు వారం నుంచి నెల వరకు సమయం పడుతుంది. దీంతో విద్యుత్ మోటార్ల ద్వారా నీరు అందే అవకాశం ఉండకపోవడంతో పంటలు ఎండిపోయే అవకాశం ఉంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 59 ట్రాన్స్‌ఫార్మర్లలో పగుల గొట్టి చోరీలు చేశారు. ఇందులో కొత్తగూడెం డివిజన్‌లో అధికంగా 45 ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడం గమనార్హం. భద్రాచలం డివిజన్‌లో 8 ట్రాన్స్‌ఫార్మర్లు, పాల్వంచ డివిజన్‌లో 6 ట్రాన్స్‌ఫార్మర్లలో చోరీలు జరిగాయి.

డివిజన్ల వారీగా చోరీ వివరాలు..
కొత్తగూడెం డివిజన్ పరిధిలోని అన్నపురెడ్డిపల్లిలో 1, బొమ్మనపల్లి 1, చంద్రుగొండ 11, చుంచుపల్లి 2, టేకులపల్లి 2, జూలూరుపాడు 19, కొత్తగూడెం నార్త్‌లో 2, సుజాతనగర్ 7, పాల్వంచ డివిజన్‌లోని పాల్వంచ రూరల్ 4, ములకలపల్లి 2, భద్రాచలం డివిజన్‌లో పినపాక 6, అశ్వాపురంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి చోరీ చేశారు.

రక్షణ చర్యలు తీసుకుంటున్నాం



ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ చోరీ కాకుండా రక్షణ చర్యలు తీసుకుంటున్నాం. కాపర్ కాకుండా అల్యూమినియం తీగల ట్రాన్స్‌ఫార్మర్లను అమరుస్తున్నాం. దొంగలు ఓపెన్ చేయకుండా నాలుగు కార్నర్లలో వెల్డింగ్ చేయడంతోపాటు నాలుగు వైపుల యాంటీ తెఫ్ట్ బోల్టులు బిగిస్తున్నాం.
–జి మహేందర్, విద్యుత్ ఎస్‌ఈ

మిర్చి ధర పతనం

- రూ.10 వేలకు పడిపోయిన మోడల్ ధర
- గరిష్ట ధర రూ.13 వేలు దాటుతున్నా కొందరికే..
- నాణ్యత పేరిట తగ్గిస్తున్న వ్యాపారులు

ఖమ్మంవ్యవసాయం: మిర్చి ధర రోజురోజుకూ మరింతగా పతనమవుతోంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో గత వారం వరకు మిర్చి జెండాపాట ధర రూ.13,500 పలకగా, కొద్ది రోజులుగా రూ.13 వేల నుంచి రూ.12,850 మధ్య కొనసాగుతోంది. ఇక రూ.12 వేల వరకు పలికిన మోడల్ ధర కొద్ది రోజులుగా రూ.10 వేలు దాటడం లేదు. మార్కెట్‌లో వ్యాపారులు అధికంగా మోడల్ ధరతోనే కొనుగోలు చేస్తారు. కనిష్ట ధరలు మరింత దయనీయంగా ఉన్నాయి. ఇది రూ.5,800కు మించి దాటకపోవడం గమనార్హం.

గత ఏడాదితో పోలిస్తే దయనీయం
మిర్చి ధర గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది బాగా తగ్గింది. గత ఏడాది సీజన్‌లో క్వింటా మిర్చి రూ.20 వేల వరకు పలకగా.. ఈ ఏడాది సీజన్ ఆరంభం నుంచే ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. తొలినాళ్లలో రూ.15,500 వరకు ధర పలకగా, క్రమక్రమంగా పతనమవుతోంది. మార్చి నుంచి మరింత పతనం దిశగా కొనసాగుతోంది. ఖమ్మం మార్కెట్‌లో తేజా రకం మిర్చి కొనుగోళ్లకు పేరు ఉండగా.. ఇక్కడి వ్యాపారులు చైనా, తదితర దేశాలకు ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం మార్కెట్‌కు 40 నుంచి 50 వేల బస్తాల మిర్చి వస్తోంది.

ఈ ఏడాది సీజన్‌లో ఖమ్మం మార్కెట్‌లో మిర్చి ధరలు

తేదీ	గరిష్ట ధర (రూ.ల్లో)	మోడల్ ధర (రూ.ల్లో)
నవంబర్ 6	18,000	17,500
డిసెంబర్ 9	16,500	16,000
జనవరి 17	15,500	15,000
ఫిబ్రవరి 2	14,200	13,700
మార్చి 18	13,700	12,000
ఏప్రిల్ 2	13,300	12,000
ఏప్రిల్ 15	13,500	11,000
ఏప్రిల్ 29	13,400	10,500
ఏప్రిల్ 30	12,850	10,000
మే 7	13,350	10,000



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో విక్రయానికి తీసుకొచ్చిన మిర్చి

మోడల్ ధరకే అధిక కొనుగోళ్లు
మార్కెట్‌లో జెండా పాట విధానం ద్వారా మిర్చికి ధర ఖరారు చేస్తారు. పంటకు డిమాండ్, నాణ్యతా ప్రమాణాల పేరిట వ్యాపారులు మోడల్ ధరతోనే అధికంగా కొనుగోలు చేస్తున్నారు. జెండాపాట ధర తో పోలిస్తే దాదాపు రూ.3వేలు తగ్గిస్తుండగా.. రూ. 10 వేలు అంతకన్నా తక్కువ ధరతోనే కొనుగోలు చేస్తుండడంతో రైతులకు నష్టం ఎదురవుతోంది.

చైనా నుంచి డిమాండ్ లేకనే..
తేజా మిర్చి ధర చైనాలో ఉన్న డిమాండ్‌పై ఆధారపడి ఉంటుంది. ఆ దేశం నుంచి ఆర్డర్ల ఆధారంగా ఎగుమతిదారులు ఇక్కడ ధర నిర్ణయిస్తారు. కానీ, ఈ ఏడాది స్థాయిలో ఆర్డర్లు లేక డిమాండ్ పడిపోయింది. ఇప్పుడు చివరి కోతలు కావడంతో నాణ్యత లేకపోవడం ఇంకో కారణంగా చెబుతున్నారు. కానీ, దీన్ని సాకుగా చూపుతూ పంట నాణ్యతగా ఉన్నా వ్యాపా రులు ధరలో మరింతగా కోత పెడుతున్నారు. ఈ మేరకు ధర గిట్టుబాటు కాకపోవడంతో పలువురు రైతులు నాణ్యమైన పంటను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేస్తున్నారు.

పోలీసుల అదుపులో గంజాయి ముఠా.?
అశ్వారావుపేటరూరల్: విజిలెన్స్ పోలీసులు బుధవారం రాత్రి గంజాయి ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. విశ్వనీయ సమాచారం ప్రకారం.. ఏపీ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లాకు చెందిన నలుగురు, అశ్వారావుపేట ప్రాంతానికి చెందిన ముగ్గురు యువకులను పట్టుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిసింది. సుమారు 15 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై ఎస్సై యయాతి రాజును వివరణ కోరగా.. ఇంకా తన దృష్టికి రాలేదని, ఎలాంటి కేసు నమోదు కాలేదని తెలిపారు.

ఐరన్ మెష్ చోరీ
భద్రాచలంఅర్బన్: పట్టణంలోని గోదావరి స్నానాల ఘాట్ వద్ద ఇరిగేషన్ అధికారులు భక్తుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఐరన్ మెష్‌ను మంగళవారం అర్ధరాత్రి చోరీ చేశారు. ఇందుకు సంబంధించిన ఓ వీడియో బుధవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కాగా ఈ ఘటనకు పాల్పడిన వ్యక్తులను పోలీసులు గుర్తించి స్టేషన్‌కు పిలిపించారు. ఐరన్ మెష్‌ను రికవరీ చేసి తిరిగి అధికారులకు అందజేశారు. కాగా నిందితులను పోలీసులు హెచ్చరించి వదిలేసినట్లు సమాచారం.

ఆరు పశువులు పట్టివేత
ఇల్లెందు: మణుగూరు నుంచి ఇల్లెందు మీదుగా హైదరాబాద్‌కు ఓ వాహనంలో తరలిస్తున్న ఆరు దుక్కిటెద్దులను బుధవారం పోలీసులు పట్టుకుని గోశాలకు తరలించారు. తరలింపునకు అనుమతి పత్రాలు లేకపోవడంతో నలుగురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ.బి సూర్య తెలిపారు.

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా..

పాకిస్తాన్ ఉగ్రమూకలను తుదముట్టించేందుకు భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు జిల్లా ప్రజానీకం మద్దతు తెలిపింది. పలువురు ర్యాలీలు నిర్వహించారు. జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు.
–ములకలపల్లి/మణుగూరు రూరల్



ములకలపల్లి: జగన్నాథపురంలో యువకుల సంబరాలు



మణుగూరు రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

- ఆఫ్‌టైప్ ఆయిల్‌పామ్ మొక్కల బాధితులను ఆదుకుంటామని గతంలో మంత్రి తుమ్మల హామీ
- ఆయిల్‌పామ్ గ్రోవర్స్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మహేశ్వర రెడ్డి, పుల్లయ్య



మాట్లాడుతున్న కొక్కెరపాటి పుల్లయ్య

అశ్వారావుపేటరూరల్: ఆఫ్‌టైప్ ఆయిల్‌పామ్ మొక్కలతో నష్టపోయిన బాధిత రైతులకు ఆయిల్ ఫెడ్ ద్వారా నష్టపరిహారాన్ని ఇవ్వాలని తెలంగాణ ఆయిల్‌ఫెడ్ అశ్వారావుపేట ఆయిల్‌పామ్ గ్రోవర్స్ సొసైటీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు తుంబూరు మహేశ్వర రెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని నారంవారిగూడెం ఆయిల్‌ఫెడ్ డివిజనల్ నర్సరీ కార్యాలయం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల ఆయిల్‌ఫెడ్ చైర్మన్, రిటైర్డ్ శాస్త్రవేత్త, అధికారులు అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో పర్యటించి తోటలను సందర్శించి, ఆఫ్‌టైప్ పామాయిల్ వాస్తవమేనని ఒప్పుకున్నారని తెలిపారు. కానీ బాధిత రైతులకు ఆయిల్ పామ్, సీడ్, వినియోగదారుని యాక్ట్‌ల ద్వారా నష్టపరిహారం ఇచ్చే అవకాశం లేదని చెప్పడం విస్మయానికి గురి చేస్తోందన్నారు. తక్షణమే ఆయిల్‌ఫెడ్ పునఃపరిశీలన చేసి బాధిత రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నష్టపరిహారాన్ని ఇప్పించాలని కోరారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గతంలో ఆఫ్‌టైప్ మొక్కలు ఉంటే ఆయా కంపెనీల నుంచి పూర్తిస్థాయిలో నష్టపరిహారాన్ని ఇప్పిస్తానని ప్రకటించారని, దీనికి విరుద్ధంగా ఆయిల్‌ఫెడ్ చైర్మన్, ఎండీ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆయిల్‌ఫెడ్ నర్సరీలో కాంట్రాక్టర్ వ్యవస్థను తొలగించాలని, ఆఫ్‌టైప్ మొక్కలకు కారణమైన కాంట్రాక్టర్లు, అధికారులను గుర్తించి వారి నుంచి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బాధిత రైతులు డివి చక్రధర్‌రెడ్డి, చెలికాని సూర్యారావు, చెలికాని వెంకట్రావ్, జగ్గవరపు దామోదర్ రెడ్డి, కే వీరస్వామి, కొండ్రు మురళి, కారం వసంతరావు, వంకా చంద్రశేఖర్, కారం వెంకట్రావ్, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

రేపు వివాహం.. పెళ్లి కొడుకు అదృశ్యం
వరుడిది ఏపీలోని కుక్కునూరు

భద్రాచలంఅర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి పెళ్లి పత్రికలు పంచేందుకు వచ్చి భద్రాచలంలో అదృశ్యమైన ఘటనపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం దామరచర్లకు చెందిన యువకుడు సాయిబాబాకు ఈ నెల 9న వివాహం జరగనుంది. దీంతో ఈ నెల 4న భద్రాచలంలోని జగదీష్ కాలనీలో నివాసం ఉండే తన అక్క శ్రావణికి శుభలేఖ ఇచ్చేందుకు వచ్చాడు. శుభలేఖ ఇచ్చి తిరిగి బయలుదేరిన సాయిబాబా ఇంటికి చేరుకోలేదు. నాలుగు రోజులపాటు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

17.5 కేజీల గంజాయి స్వాధీనం
భద్రాచలంఅర్బన్: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు అటవీ ప్రాంతం నుంచి భద్రాచలం మీదుగా బైక్‌పై గోదావరిఖనికి అక్రమంగా తరలిస్తున్న గంజాయిని బుధవారం ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పోలీసులు భద్రాచలంలోని కూనవరం రోడ్డులో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై 17.5 కేజీల గంజాయి తీసుకెళ్తుండగా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. గంజాయి, బైక్, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొన్నారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.8.75 లక్షలుగా నిర్ధారించినట్లు ఎస్‌ఐ గౌతమ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు
టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడిన సంఘటన బుధవారం జరిగింది. బోడు విద్యుత్ సబ్ స్టేషన్‌లో డైలీవేజ్ కార్మికుడిగా పనిచేస్తున్న టేకులపల్లి పంచాయతీ సక్రు తండాకు చెందిన భూక్య లక్ష్మణ్ విధులు ముగించుకుని బుధవారం బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో సామ్య తండా వద్ద పశువులు పోట్లాడుకుని అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చాయి. దీంతో పశువులకు బైక్‌ను ఢీకొనడంతో కింద పడిన లక్ష్మణ్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతన్ని ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ తీగ తెగిపడి ఆవు మృతి



మృతిచెందిన ఆవు (ఇన్‌సెట్) విద్యుత్‌పోల్ వద్ద తెగిన వైరు

పాల్వంచరూరల్: విద్యుత్ తీగ తెగిపడి మేత మేస్తున్న ఆవు మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. మండల పరిధిలోని రంగాపురం గ్రామానికి చెందిన మాళోత్ బాలుకు చెందిన ఆవు గ్రామ శివారులో మేస్తుండగా 11కేవీ విద్యుత్ లైన్ తీగ తెగి ఆవుపై పడింది. దీంతో ఆవు విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. కాగా తాము జీవనోపాధి కోల్పోయామని ఆవు యజమాని బాలు దంపతులు బోరున విలపించారు. రూ.40 వేల నష్టపరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ ఏఈ రవీందర్ తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య
గుండాల: ఆళ్లపల్లి మండలం మర్కోడు గ్రామపంచాయతీ పెద్దూరు గ్రామానికి చెందిన సంజీవరావు (26) పురుగుల మందు బుధవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మద్యానికి బానిసగా మారిన సంజీవరావు ఏ పనీ చేయకపోవడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపం చెంది ఈ నెల 4న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటంబ సభ్యులు కొత్తగూడెంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించినట్లు ఎస్సై సోమేశ్వర్ తెలిపారు.

పురుగుల మందు తాగి..
కరకగూడెం: మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కరకగూడెం ఎస్సై నాగేశ్వరరావు కథనం ప్రకారం.. మండల పరిధిలోని అనంతారం గ్రామానికి చెందిన కొప్పుల సతీష్ (34) కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం బుధవారం వరంగల్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలిక ఆత్మహత్యాయత్నం
కరకగూడెం: పురుగుల మందు తాగి ఓ బాలిక ఆత్మహత్యకు యత్నించిన ఘటన బుధవారం జరిగింది. మండలంలోని వీరాపురం గ్రామానికి చెందిన ఓ బాలిక ఇంట్లో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి చేరగా, కుటుంబ సభ్యులు కరకగూడెం పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మణుగూరు వంద పడకల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చెట్టును బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు
కరకగూడెం: మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన యువకులు ఎల్లబోయిన కల్యాణ్, నవదీప్ బుధవారం ద్విచక్ర వాహనంపై గ్రామం నుంచి ప్రధాన రోడ్డుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి తాటి చెట్టుకు ఢీకొట్టింది. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108లో కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, అక్కడి నుంచి భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఇసుక టిప్పర్లు నిలిపివేత



చెక్‌పోస్టు వద్ద నిలిపివేసిన ఇసుక టిప్పర్లు

పాల్వంచరూరల్: ఓవర్ లోడ్‌తో వెళ్తున్న మూడు ఇసుక టిప్పర్ వాహనాలను బుధవారం చెక్‌పోస్టు సిబ్బంది నిలిపివేశారు. తహసీల్దార్ వివేక్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని నాగారం కాలనీ వద్ద ఆర్టీఏ చెక్‌పోస్టు సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద భద్రాచలం నుంచి పాల్వంచ వైపు ఓవర్‌లోడుతో వెళ్తున్న మూడు టిప్పర్ వాహనాలను సిబ్బంది నిలిపివేశారు. అనంతరం మైనింగ్ ఏడీ దినేష్ వాహనాలను పరిశీలించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్
పాల్వంచ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను బుధవారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. మొర్రేడు వాగు నుంచి ఇసుక తీసుకెళ్తుండగా ఆర్‌ఐ రవికుమార్ కుంటినాగుల గూడెం వద్ద పట్టుకుని, తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. వాహనాలను సీజ్ చేశామని, ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తామని ఆర్‌ఐ తెలిపారు.

యువకుడి అదృశ్యం.. ఆచూకీ లభ్యం!
భద్రాచలంఅర్బన్: పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన ఓ యువకుడు అదృశ్యం కాగా, అనంతరం ఆచూకీ లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన యువకుడు తరపట్ల రిషీ మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో ఇంట్లో నుంచి బయటకి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. కాగా రిషీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరులో ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుతం నెల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఉంచినట్లు సమాచారం. యువకుడిని నెల్లూరుకు చెందినవారు కిడ్నాప్ చేసి అతని తల్లిదండ్రులను బెదిరించినట్లు వార్త స్థానికంగా చక్కర్లు కొట్టింది. ఇదే విషయమై స్థానిక పోలీసులను వివరణ కోరగా... విచారణ చేస్తున్నామని, అన్ని వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.